క్లుప్తంగా

నేటి నుంచి పెద్దమ్మ తల్లి జాతర

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో వెలసిన గ్రామ దేవత పెద్దమ్మతల్లి జాతరను శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఇందు కోసం గ్రామ పెద్దలు, జాతర నిర్వాహకులు ఏర్పాట్లను చేశారు.

రూ.3 లక్షలు విరాళం

ప్రొద్దుటూరు కల్చరల్ : హైదరాబాద్‌కు చెందిన తప్పెటోబాయిపల్లి మోహన్‌రెడ్డి బంధువులు రాచమల్లు సుధ, నేటపల్లి విజయలక్ష్మి, లింగారెడ్డి భారతి, లింగందిన్నె శారద 'శివోహం' అన్నప్రసాద సేవా సంఘానికి రూ.3లక్షలు విరాళం అందజేశారు. గురువారం స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో వారి తరఫున తప్పెటోబాయిపల్లి మోహన్‌రెడ్డి శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి నగదు అందించారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని వినియోగించుకోండి

పోరుమామిళ్ల : ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రజకులు, నాయీ బ్రాహ్మణులు, వడ్డెరలు, మత్స్యకారులు, స్వర్ణకారులు, కార్పెంటర్లు, బేల్దారు లు, కల్లుగీత కార్మికులు, తదితర కుల వృత్తులకు చెందినవారు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు చెప్పిన విధంగా చదువుకుంటే ఉన్నత స్థాయి ఎదుగుతారని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ పేర్కొన్నారు. మండలంలోని నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు ఆధ్వర్యంలో స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవిశంకర్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పోలీస్ ఫెన్సింగ్‌లో కాంస్య పతకం

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన కానిస్టేబుల్ మహబూబ్‌బాషా ఇటీవల పంజాబ్ స్టేట్‌లోని జలంధర్‌లో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలో పాల్గొని కాంస్య పతకం సాధించారు. మహబూబ్‌బాషా పోరుమామిళ్ల తైక్వాండో క్లబ్‌లో మాస్టర్ నాయబ్ రసూల్ వద్ద శిక్షణ పొందారు. తైక్వాండో క్లబ్ నుండి స్పోర్ట్స్ కోటాలో పోలీస్ ఉద్యోగం సాధించారు. మహబూబ్‌బాషాను గురువారు పోరుమామిళ్లలో మాస్టర్ నాయబ్ రసూల్ అభినందించారు. రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్త అభినందించారన్నారు.

కులవృత్తుల వారికి సమావేశం

కాశినాయన : మండలంలో ఆదరణ–3 పథకం కింద వృత్తికి అవసరమైన ఆధునిక పనిముట్ల కొరకు సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు ఈనెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు బీసీ కుల వృత్తులపై అవగాహన

బ్రహ్మంగారిమఠం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం బీసీ కులాలకు చెందిన కులవృత్తులు, చేతి వృత్తుల వారికి ఆధరణ–3 పథకం క్రింద అవగాహన సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ప్రకటనలో తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలో విరివిగా చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, రూరల్, అర్బన్ సీఐలు నాగభూషణ్, రాజగోపాల్‌లు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి, మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జీ.వెంకటసుబ్బారెడ్డి, ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లాయంయోగయ్య, గంగసాని సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న ఉచిత వైద్య శిబిరం

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 23న ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు బైరెడ్డి సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ ట్రస్టు వ్యవస్థాపకులు హైకోర్టు లాయర్ లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 73862 30697, 63042727551 సంప్రదించాలన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక విజయేశ్వరి వృద్ధాశ్రమంలో పోరెడ్డి సుజాత 58వ జయంతి సందర్భంగా పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత పోరెడ్డి నరసింహారెడ్డి, వారి కుమారులు సందీప్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి నరసింహారెడ్డి అక్క కాకర్ల రాజేశ్వరి, బావ కాకర్ల బాలకృష్ణారెడ్డి, బొల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ లోడు పెంపునకు రాయితీ

- గృహ వినియోగదారులకు విద్యుత్‌శాఖ సదావకాశం
- అధిక లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ
- లోడు పెంచుకునేందుకు జూన్ 30 వరకు గడువు



పగడాల విద్యుత్ సబ్ స్టేషన్

క్రమబద్ధీకరణకు ఇచ్చే రాయితీ వివరాలు

అదనపు లోడు (కిలోవాట్)	అసలు ధర (కిలోవాట్)	తగ్గింపు ధర (కిలోవాట్)
1	రూ.2250	రూ.1250
2	రూ.4450	రూ.2450
3	రూ.6650	రూ.3850
4	రూ.8850	రూ.4450

కాశినాయన : ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వాడకం సామాన్యమైపోయింది. దీంతో ఇంటికి వస్తున్న విద్యుత్ సరిపోక తరచూ విద్యుత్ ట్రిప్ అవుతుంది. ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి విద్యుత్ అధికారులు వినియోగదారులకు వెలుసుబాటు కల్పించారు. విద్యుత్ కిలోవాట్స్ పెంచుకోవడానికి 50 శాతం రాయితీ కల్పించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. జూన్ 30 వరకు ఈ అవకాశం కల్పించారు. ఇలా కాకుండా గడువు ముగిసిన తర్వాత అధికారులే వచ్చి తనిఖీ నిర్వహిస్తే పూర్తి మొత్తం చెల్లించాల్సి వస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం విద్యుత్ కనెక్షన్ ఉన్న ఇంట్లో ఎక్కువగా ఒక బల్బు, ఒక ఫ్యాన్ వినియోగంలో ఉండేది. ప్రస్తుతం విద్యుత్ పరికరాల వినియోగం పెరిగిపోవడంతో వాడకం ఎక్కువైంది. గత పది సంవత్సరాలతో పోల్చితే విద్యుత్ వాడకం ఇప్పుడు మూడింతలు పెరిగింది. దీంతో నాణ్యమైన విద్యుత్ అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫ్యాన్ల స్థానంలో ఏసీలు పెరిగిపోయాయి. వేడినీటికి హీటర్లు, దుస్తులు ఉతికేందుకు వాషింగ్ మిషన్లు, పిండి రుబ్బడానికి గ్రైండర్లు సర్వసాధారణమయ్యాయి. మోటార్ సైకిళ్ళు, కార్లు సైతం విద్యుత్ ద్వారా ఛార్జింగ్ చేసుకుంటున్నారు.

లోఓల్టేజీ సమస్యలు దూరం

వినియోగదారులు వినియోగించుకునే విద్యుత్‌ను క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు దాదాపు సగం రాయితీ కల్పిస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు తెలిపారు. గృహ విద్యుత్ అవసరాలకు కనెక్షన్ ఇచ్చే సమయంలో వాడే లైట్లు, గృహోపకరణాల అవసరాలను అంచనా వేసి కిలోవాట్స్ లెక్కన డెవలప్‌మెంట్ ఛార్జి, సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకునేవారు. దాని కంటే ఎక్కువగా వినియోగదారుల వాడకం పెరిగింది. అధికంగా విద్యుత్ పరికరాల వాడకం వలన తక్కువ లోడు కోసం ఏర్పాటు చేసిన పరికరాలు తరచూ ట్రిప్ అయి లోఓల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. వినియోగదారులు కూడా తరచూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి లోడు పెంచుకోవడం ఉత్తమ మార్గమని అధికారులు సూచిస్తున్నారు.

50 శాతం రాయితీ ఇస్తున్నాం



అధిక లోడు వాడుతున్న గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తున్నాం. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జూన్ 30వ తేదీ వరకు ఈ అవకాశం ఉంది. తద్వారా లోఓల్టేజీ సమస్య ద్వారా విముక్తి పొందవచ్చు. పూర్తి వివరాలు కావాలంటే సమీప లైన్‌మెన్‌ను సంప్రదించాలి.

– ఎస్.రవీంద్రనాథ్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ, కాశినాయన

క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

బద్వేలు అర్బన్ : అభ్యంతరం లేని ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన ఇళ్ళ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతిఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ తెలిపారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన గృహాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 30 పై గురువారం మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పట్టణంలోని రిక్షాకాలనీ, సుందరయ్యకాలనీలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15కు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన పూర్తిస్థాయి ఇళ్ళకు మాత్రమే క్రమబద్ధీకరణ అవకాశం కల్పించారని తెలిపారు. 150 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారని, అయితే లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఐటీ చెల్లింపుదారులై ఉండకూడదని, అలాగే నాలుగు చక్రాల వాహనం కూడా ఉండరాదని తెలిపారు. అంతేకాకుండా చెరువు పోరంబోకులు, లేఅవుట్ స్థలాలలో నిర్మించిన ఇళ్ళకు క్రమబద్ధీకరణ అవకాశం లేదని, అలాగే ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్ళు నిర్మించిన వారు క్రమబద్ధీకరణకు అనర్హులని తెలిపారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

23 బృందాల ఏర్పాటు

ఇళ్ళ క్రమబద్ధీకరణ అంశానికి సంబంధించి అర్హుల నుండి దరఖాస్తులు చేయించేందుకు 23 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు మున్సిపల్ కమిషనర్, బద్వేలు, గోపవరం తహసీల్దార్లను పర్యవేక్షక అధికారులుగా నియమించినట్లు ఆర్డీఓ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బద్వేలు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, గోపవరం డిప్యూటీ తహసీల్దారు సత్యమూర్తి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సతీష్, వార్డు రెవెన్యూ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి

అట్లూరు : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. గురువారం డివిజన్ వ్యవసాయ కార్యాలయంలో ప్రైవేటు ఇన్పుట్ డీలర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు కొన్న విత్తనాలు, ఎరువులకు సంతకంతో కూడిన రసీదులు అందజేయాలన్నారు. ఎరువులు అమ్మకం సమయంలో రైతుల బయోమెట్రిక్ తప్పనిసరిగా సేకరించాలన్నారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి స్టాక్ పోజీషన్ రిపోర్టు కార్యాలయానికి అందజేయాలన్నారు. అలాగే వ్యవసాయ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు అన్ని రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధరల పట్టికతో పాటు స్టాక్ వివరాలు రైతులకు కనబడే విధంగా పట్టిక ప్రదర్శించాలన్నారు. 2025 ఖరీఫ్ సంవత్సరానికి సంబంధించి రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనం బ్యాచ్ వారిగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రొద్దుటూరు : మండలంలోని కామనూరు గ్రామంలో నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులను ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా సమితి సభ్యుడు వీరనారాయణరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాజీపేటలోని అన్నపూర్ణ ట్రేడర్స్ వద్ద ఆర్ఎన్ఆర్ 15048 రకం వరి విత్తనాలను ఏడు మంది రైతులు 75 ప్యాకెట్లు కొనుగోలు చేసి 75 ఎకరాల్లో సాగు చేశారన్నారు. అయితే పంట పూర్తిగా తాలు రావడంతో పంట దిగుబడి సగానికి సగం తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కంపెనీ విత్తనాలు కాకుండా వేరే విత్తనాలు ఇవ్వడం వల్లే తాము నష్టపోయామని రైతులు పేర్కొన్నారన్నారు. ఆర్ఎన్ఆర్ 15048 రకం వరి విత్తనాలు ఇతర రైతులు సాగు చేశారని, వారి పంట బాగుందని చెప్పారు. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టామని, మాకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. మల్లికార్జున రెడ్డి అనే రైతు దాదాపు 35 ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేసి నష్టపోయాడన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దీక్షలు విరమించిన పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో గల పశువైద్య కళాశాలలో స్టైఫండ్ పెంచాలని విద్యార్థులు చేస్తున్న దీక్షలను గురువారం విరమించారు. దీక్షలను విరమించి తరగతులకు హాజరువుతున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్‌కు విద్యార్థులు లేఖ ఇచ్చారు. ఈ సందర్భంగా పశువైద్య విద్యార్థులు మాట్లాడుతూ 46 రోజులుగా స్టైఫండ్ పెంచాలని దీక్షలు చేపట్టామన్నారు. అందుకు ప్రభుత్వం ఇస్తున్న స్టైఫండ్‌లో 50 శాతం పెంచి జీఓ ఇచ్చిందన్నారు. కానీ ఈ 50 శాతం పెంపుపై తాము ఆనందంగా లేమన్నారు. ప్రతి సంవత్సరం 10 శాతం స్టైఫండ్ పెంచాలని పశువైద్య విశ్వవిద్యాలయం పరిపాలన విభాగానికి వినతి పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య విద్యార్థులు శివతరుణ్, రాహుల్, విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్‌కు లేఖ అందిస్తున్న విద్యార్థులు

పైపులైన్ మరమ్మతు పనుల పరిశీలన

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, నీటి సరఫరా అధికారులు పరిశీలించారు. అమృత్ పథకం కింద పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మేఘా ఇంజనీరింగ్ వర్క్స్ నూతనంగా వేసిన 300 ఎంఎంఎ డయా డీఐ పంపింగ్ లైన్ నుండి పాత మార్కెట్ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ పెట్టి చెక్ చేయగా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పైపులైన్ లీకేజీ వచ్చింది. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయిన వెంటనే పాత మార్కెట్ ట్యాంక్‌కు సంబంధించిన ప్రాంతాలకు అమృత్ పథకం ద్వారా మైలవరం నుండి మంచి నీటిని సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు.



పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

బియ్యం బ్లాక్ మార్కెట్‌పై అసెంబ్లీలో చర్చ

ఎండీయూ వాహనాలను తొలగించాలని కోరిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు : విచ్చల విడిగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జరుగుతున్న రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌పై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గురువారం అసెంబ్లీలో చర్చించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల ద్వారానే బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతోందని, ఆ వాహనాలను తొలగించి పాత పద్ధతిలో డీలర్లకే అప్పగించాలని వరదరాజులరెడ్డి అసెంబ్లీలో కోరారు. బ్యాక్‌లాగ్ బియ్యంపై అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలంటే బియ్యానికి బదులు ప్రభుత్వమే నగదు పంపిణీ చేసే ఆలోచన చేయాలని ఎమ్మెల్యే కోరారు.

వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడిగా యల్లారెడ్డి

రాజుపాళెం : రాజుపాళెం మండల రెవెన్యూ అధికారుల (వీఆర్‌ఓ) ల సంఘం అధ్యక్షుడిగా గుండ్లదుర్తి యల్లారెడ్డి (తొండలదిన్నె)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజుపాళెంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఈ ఎన్నిక కార్యక్రమం జరిగింది. అందులో కార్యదర్శిగా మోటకట్ల జయన్న (చిన్నశెట్టిపల్లె), కోశాధికారిగా కేవీ కృష్ణమూర్తి (రాజుపాళెం) ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ హుసేన్ రెడ్డి, మండలంలోని వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో గురువారం బద్వేలు మాస్క్ కమిటీ అధ్యక్షుడు అల్లాబకష్ ఆధ్వర్యంలో 500 మంది ముస్లిం పేదలకు రంజాన్ తోఫాగా నిత్యావసర వస్తువులను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బద్వేలు మాస్ కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, సెక్రటరీ మౌలాలి, బద్వేలు మైనారిటీ అధ్యక్షుడు కరీముల్లా, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ నరసింహులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గురువారం ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు రంజాన్ తోఫా అందించారు. మదూరు గ్రామానికి చెందిన కట్టుబడి అబ్దుల్ రసూల్ జ్ఞాపకార్థం వారి కుమారులు మహబూబ్ బాషా, చాంద్ బాషా 25 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందించారు.

భక్తుల కొంగుబంగారం చౌడేశ్వరీదేవి

రేపటి నుంచి అమ్మవారి తిరునాల

ఖాజీపేట : భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంలా శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారుగా ప్రసిద్ధి చెందారు. ఖాజీపేట మండలం కొమ్మలూరులో వెలసిన అమ్మవారి తిరునాల మహోత్సవం శనివారం నుంచి కనుల పండువగా నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు.

బండలాగుడు పోటీలు

తిరునాల సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతాయి. పోటీలో విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ. 30వేలు, రెండో బహుమతి రూ. 20వేలు మూడవ బహుమతి రూ.10 వేలు అందజేయనున్నారు. భక్తులకు ఆలయకమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు.



రామలింగ చౌడేశ్వరిదేవి

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

గోపవరం : మండలంలోని బేతాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో గోపవరం రెవెన్యూ పొలం–2 లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించారు. సర్వే నెంబర్ 1968/1 లోని 59 సెంట్లు, సర్వే నెంబర్ 1453/5సి లోని 72 సెంట్లు ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు జేసీబీతో కంపచెట్లను తొలగించారు. పి.పి.కుంట సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పక్కనే ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో కొంత భాగం తెలుగుకాలువ వెళుతుంది. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. రోడ్డు పక్కనే జేసీబీతో ప్రభుత్వ భూమిలోని కంపచెట్లను తొలగిస్తున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఖాళీగా ఉన్నా వెంటనే కబ్జాదారులు వాలిపోతున్నారు. ఈ ప్రాంతంలోని భూములకు డిమాండ్ ఉండటంతో పాటు అధిక ధరలు పలుకుతుండటంతో కబ్జాదారులు సెంటు స్థలాన్ని కూడా వదలడం లేదు. ఒక పక్క మండలంలో రీ సర్వే కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వ భూముల కబ్జాలు మాత్రం ఆగడం లేదు. ఇప్పటికే ఇదే రెవెన్యూ పొలం పి.పి.కుంట సమీపంలో వేసిన జగనన్న లేఅవుట్‌లో కూడా అక్రమంగా గుడిసెలు వేసి స్థానికేతరులు నివాసముంటున్నారు. జగనన్న కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులు మాత్రం ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు స్థలాలు చూపకపోగా కనీసం జగనన్న లేఅవుట్‌లో వేసిన గుడిసెలను తొలగించకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు భూ కబ్జాలకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కంపచెట్లను తొలగించిన దృశ్యం

డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ అధికారులతో కలిసి నిర్వహించిన మార్నింగ్‌వాక్ కార్యక్రమంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వెనుక భాగంలో, శ్రీకృష్ణదేవరాయనగర్, మహబూబ్‌నగర్‌లలో ఉన్న డ్రైనేజీ సమస్యను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండు వెనుక భాగంలో చాలా రోజులుగా డ్రైనేజీ సమస్య ఉందని, ఆర్టీసీ అధికారులను సమన్వయం చేసుకుని తక్షణమే ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే సిద్ధవటం రోడ్డులో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ కాలువ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు మురుగునీరు సక్రమంగా వెళ్ళేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంజనీరింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పైపులైను లీకేజీలు, మరమ్మత్తులు వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వాటిని పరిష్కరించి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, కౌన్సిలర్లు దుద్దుకూరుసత్యానారాయణ, హసన్, డీఈ సుమన్‌రెడ్డి, ఏఈ మహేష్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండులో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

పలువురిని పరామర్శించిన రాచమల్లు


ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం పలువురిని పరామర్శించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆపరేషన్ చేయించుకుని వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి తల్లి రాజేశ్వరమ్మను వారి ఇంటికి వెళ్లి రాచమల్లు పరామర్శించారు. అనంతరం జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ సభ్యురాలు కొండా ధనలక్ష్మి భర్త కళ్యాణ చక్రవర్తి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఇటీవల చక్రవర్తి వేలూరు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న రాచమల్లు ఆయనను పరామర్శించారు. అనంతరం ప్రముఖ వైద్యురాలు డాక్టర్ నాగలక్ష్మి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, పిట్టా బాలాజీ, వరికూటి ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కసిరెడ్డి రాజేశ్వరమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : తన భూములను కబ్జా చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన ఎ.సుబ్బలక్షుమ్మ తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ తన కుటుంబానికి శంకరాపురం, చౌటపల్లె, కాకిరేనిపల్లె, పెద్దశెట్టిపల్లె, రంగసాయిపురంలో 170 ఎకరాల భూమి ఉందన్నారు. తన భర్త దస్తగిరి రెడ్డి 35 ఏళ్ల క్రితం మృతి చెందడంతో కొంత మంది తమ భూములను స్వాహా చేశారన్నారు. రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ సహకారంతో పట్టాదారు పాస్‌పుస్తకాలు, అడంగల్లను మార్చు చేసి తమ భూములను స్వాహా చేశారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల సర్వేలో తమ భూములు కబ్జా అయిన విషయం బయటపడిందన్నారు. దీనిపై తహసీల్దార్‌ను కలిసినా ఉపయోగం లేదన్నారు. కలెక్టర్‌ను కలిస్తే రెవెన్యూ సదస్సుల్లో మీ సమస్యను పరిష్కరిస్తామన్నారే కానీ మూడు నెలలైనా అతి గతి లేదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూములు తమకు స్వాధీనం చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు.



మాట్లాడుతున్న సుబ్బలక్షుమ్మ

ఆధార్ శీల, నవచేతనతో అంగన్‌వాడీల అభివృద్ధి

మైదుకూరు : ఆధార్ శీల, నవ చేతన కార్యక్రమాలతో అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక అమలు చేస్తుందని ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. స్థానిక వెలుగు సమావేశ మందిరంలో మూడు రోజుల పాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ – పడాయి బీలో భాగంగా నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని 0–3 సంవత్సరాల లోపు పిల్లలకు నవచేతన, 3–6 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ శీల పేరుతో పోషణతోపాటు పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను కార్యకర్తలు బలోపేతం చేయాల్సి ఉందన్నారు. శిక్షణలో మండలంలోని 44 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జె.ప్రశాంతి, కె.ఓబుళమ్మ, జె.శ్రీదేవి పాల్గొన్నారు.



చాపాడు: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్లు



మైదుకూరు :మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

చాపాడు : అంగన్వాడీ స్థాయిలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారిలో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం పోషన్ బీ పడాయ్ బీ కార్యక్రమంపై చాపాడు, దువ్వూరు మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మొదటి రోజు డిజిటల్ స్క్రీన్‌పై అంగన్వాడీ కేంద్రాలలో అందించాల్సిన సేవలు, విద్యా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు విద్యా ప్రమాణాలపై అవగాహన కల్పించేలా అంగన్వాడీ వర్కర్లు చర్యలు తీసుకోవాలన్నారు. 0–3 ఏళ్ల లోపు పిల్లలకు ఆధార్ నవచేతన, 3–6 ఏళ్ల లోపు చిన్నారులకు ఆధార్ షీలా పేరుతో కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. పిల్లలో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాలు పని చేయాలని వర్కర్లు దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ, సుబ్బరత్నమ్మ, సౌజన్య, ప్రత్యూష, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.